

అత్యాచార ఘటనపై దర్యాప్తునకు ఆదేశం

ప్రజాశక్తి-అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన మండలంలో చిర్రా యానాం గ్రామంలో బాలికపై అత్యాచార ఘటన పై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటనపై ఆమె ఫోన్‌లో శుక్రవారం పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. అత్యాచార ఘటనకు సంబంధించి వెంటనే సమగ్ర దర్యాప్తు చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని ఆమె పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. బాధితురాలికి అండగా ఉండాలని మహిళా కమిషన్ సభ్యురాలు జయశ్రీని మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ కోరారు. అత్యాచార ఘటనకు సంబంధించి ప్రమేయం ఉన్న నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ తెలిపారు.





అనపర్తి దేవీచౌక్ వద్ద బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు.. బారికేడ్లను తోసుకువస్తున్న టిడిపి శ్రేణులు

ఉద్రిక్తత

- అనపర్తిలో బాబు పర్యటనను అడ్డుకున్న పోలీసులు
- ప్రతిఘటించిన టిడిపి శ్రేణులు - కాలినడక సభాస్థలికి అధినేత

ప్రజాశక్తి - కాకినాడ, రాజమండ్రి ప్రతినిధులు సామర్లకోట, సామర్లకోట రూరల్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో టిడిపి అధినేత చంద్రబాబు చేపట్టిన పర్యటనలో మూడో రోజైన శుక్రవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాకినాడ జిల్లాలో పర్యటన అనంతరం ఆయన తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గానికి చేరుకునేందుకు బయలు దేరారు. అనపర్తి దేవీచౌక్ వద్ద ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఆయన బహిరంగ సభలో మాట్లాడాల్సి ఉంది. ఆయన కాన్వాయ్ సామర్లకోట నుంచి అనపర్తి నియోజక వర్గంలోని బలభద్రపురం చేరుకునే సరికి పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల తీరుపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనం దిగి కాలినడకన సుమారు ఏడు కిలోమీటర్ల మేర నడిచి అనపర్తి దేవీచౌక్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడా ఆయన్ని అడ్డుకునేందుకు పోలీసులు బారి కేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు బారికేడ్లను తోసుకుంటూ చంద్రబాబును సభాస్థలికి తీసుకొచ్చారు. సభ జరగకుండా మైక కట్ చేశారు. జనరేటర్లకు తాళాలు వేయించారు. చీకటి మయంగా మారడంతో కార్యకర్తలు సెల్‌ఫోన్ లైట్లను వేసి అధినేతకు సంఫీ ్భావం తెలిపారు. దీంతో టిడిపి నాయకులే తాళాలలు బద్దలగొట్టి జనరేటర్లను ఆన్ చేయించారు.అనంతరం చంద్రబాబు మాట్లాడారు.

సైకో పాలనకు ప్రజలే స్వస్తి పలకాలి

రాష్ట్రంలో జరుగుతున్న సైకో పాలనకు ప్రజలే స్వస్తి పలకాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. సైకో పాలనలో ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారిందన్నారు. అన్ని రంగాల కార్మికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధాన్యం కొనుగోలులో స్థానిక ఎంఎల్ఎ వాటాలు వసూలు చేస్తున్నారని, గ్రావెల్ మాఫియాకు అనపర్తి నియోజకవర్గం అడ్డాగా మారిందని వివరించారు. రూ.400 కోట్ల లేటరైట్, గ్రావెల్ దోచుకునే ప్రయత్నాన్ని అడ్డుకున్న ఘన చరిత్ర నల్లమిల్లి రామకృష్ణారెడ్డిదేనని అభినందించారు. అనపర్తిలో తనను అడ్డుకోవటం సిగ్గుచేటన్నారు. గ్రావెల్ సూర్యనారాయణ ఖబడ్దార్ అంటూ అనపర్తి ఎంఎల్ఎను హెచ్చరించారు.

దళితులకు అండగా ఉంటాం...

టిడిపి ఎప్పుడూ దళితులకు అండగా ఉంటుందని చంద్రబాబు అన్నారు. కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా ఆయన సామర్లకోట నవభారత్ వెంచర్స్ పరిశ్రమ అతిథిగృహం ఆవరణలో మాజీ మంత్రి జవహర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన దళిత సదస్సులో ఆయన మాట్లాడారు. దళితుల కోసం జస్టిస్ పున్నయ్య కమిషన్ వేశామని గుర్తు చేశారు. ఆయన నివేదిక ప్రకారం పలు పథకాలను అమలు చేశామన్నారు. ప్రతిభా భారతిని అసెంబ్లీ స్పీకర్‌ను చేశామని, కాకి మాధవరావును చీఫ్ సెక్రటరీగా, జిఎంసి బాలయోగిని లోక్ సభ స్పీకర్‌గా చేసిన ఘనత టిడిపికే దక్కిందన్నారు. అవినీతి, దోపిడీని ప్రశ్నించిన దళితబిడ్డలకు శిరోముండనాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి ఎంఎల్‌సి ఒక దళితుడిని చంపేసి డోర్ డెలివరీ చేశారన్నారు. దళిత నిధులను నవరత్నాలకు మళ్లించిన జగన్ రెడ్డి దళితద్రోహిగా మిగిలిపోయాడన్నారు. ఈ సందర్భంగా మహాసేన రాజేష్ తన అనుచరుగణంతో టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు గొల్లపల్లి సూర్యారావు, యనమల రామకృష్ణుడు, చిక్కాల రామచంద్రరావు, పెద్దాపురం ఎంఎల్ నిమ్మకాయల చినరాజప్ప, టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మాజీ ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభకు నడిచి వెళుతున్న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు

వేట్ల పాలెంలో నిరసన సెగ

సామర్లకోట మండలం వేట్లపాలెంలో ఏర్పాటు చేసిన మాజీ ఎంఎల్‌సి బొడ్డు భాస్కరరామారావు విగ్రహ ఆవిష్కరణకు వచ్చిన చంద్రబాబుకు నిరసన సెగ తగిలింది. టిడిపి ముద్దు.. రాజప్ప వద్దు.., రాజప్ప గో బ్యాక్ అంటూ బొడ్డు భాస్కరరామారావు తనయుడు వెంకటరమణ చౌదరి అనుచరులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాబు జోక్యం చేసుకుని సముదాయించారు. వైసిపి పాలనను అంతమొందించాలని, చినరాజప్పను మరోసారి గెలిపించు కోవాలని సూచించారు. వెంటకరమణకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాజకీయాల్లో బొడ్డు భాస్కరరామారావు ఒక ధ్రువవ తారగా వెలుగొందారన్నారు. ఆయన మరణం దురదృష్టకరమన్నారు. ఈ టిడిపి నాయకులు గుణ్ణం చంద్రమౌళి, మాజీ ఎంపిపి కొండపల్లి కృష్ణమూర్తి, అడబాల కుమారస్వామి, కంటే బాబు పాల్గొన్నారు.

ఉగాదికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం

పేదలందరికీ ఇళ్లు నిర్మాణ కార్యక్రమం లో భాగంగా స్టేజ్ కన్వర్షన్ ద్వారా ఉగాది నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా హౌసింగ్ ఇంజనీర్లను ఆదేశించారు. శుక్రవారం గృహ నిర్మాణ సంస్థ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఇంజ నీర్లతో నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన అంశాల పురోగతి పై కలెక్టర్ అధ్యక్షతన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సహాయ ఇంజనీర్ల స్థాయిలో గృహ నిర్మాణాల మౌలిక వసతులపై సమీక్షించి గృహ నిర్మాణాల పూర్తికి గడువులు విధించుకున్నారు. రాఫుని మార్చి 10 నాటికి బిబిఎల్ స్థాయిలో ఉన్న గృహాలు బిఎల్ స్థాయికి, ఆర్ఎల్ స్థాయిలో ఉన్న గృహాలు రూఫ్ లెవెల్ స్థాయికి, ఆర్సి స్థాయిలో ఉన్న గృహాల నిర్మాణాలు పూర్తి చేయడానికి గడువులు విధించారు. గృహ నిర్మాణాలకు కొరకు తాపీ మేస్త్రీలను మాత్రమే నియమించి పూర్తి చేయాల్సి ఉం టుందన్నారు. జగనన్న కాలనీలలో అనర్హులు ఉన్నట్లయితే పట్టా రద్దుచేసి ఆ స్థలాన్ని 90 రోజుల్లో ఇంటి స్థలం కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 4 ప్రాధాన్యత సంవత్సరాల గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని పురపాలక సంఘాల కమిషనర్లను ఆదేశించారు. పిఎంఎవై (గ్రామీణ, అర్బన్), సొంత స్థలం కలిగి ఉన్నవారి, గృహ నిర్మాణాల పురోగతిపై వివిధ దశలను అయన మండలాల వారీగా సమీక్షించారు. ఉగాది నాటికి 8,600 గృహాలు పూర్తి చేయాల్సిందిగా కేవలం 56 శాతం పూర్తయిందని మిగిలిన లక్ష్యాలను ఉగాది నాటి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్ఇ చంటిబాబు, గృహ నిర్మాణ సంస్థ పిడి ఎం.బాబు రావు, ఇఇ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు విపిన్ నాయుడు, కె.శ్రీకాంత్ రెడ్డి లోవరాజు, గృహ నిర్మాణ ఇంజనీర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు

మాతా-శిశు మరణాల రేటు తగ్గించాలి

మాతా శిశు మరణాల రేటు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని వైద్యశాఖ అధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ కన్వర్జెన్సీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.

మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలి

మత్స్యకారుల అభ్యున్నతికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాల మంజూరు కొరకు గ్రామీణ పేదరిక నిర్మూలన, మెప్మా, జిల్లా పరిశ్రమల విభాగం, లీడ్ బ్యాంకు మేనేజరు, మార్కె టింగ్ సహాయ సంచాలకుల సమన్వయంతో యూనిట్ల గ్రౌండ్ చేస్తూ ఆయా వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో వివిధ శాఖల సమన్వయ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.

2వ రోజూ ఎంఎల్‌సి నామినేషన్లు నిల్

కాకినాడ కార్పొరేషన్ : కాకినాడ జిల్లాలో శాసనమండలి ఎన్నికలకు కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జెసి ఇలక్కియా నామినేషన్ స్వీకరిస్తున్నారు. మొదటిరోజు ఒక నామినేషన్ కూడా పడకపోవడంతో రెండో రోజు నామినేషన్ పడుతుందా అని ఎదురుచూసినా, రెండోరోజు కూడా నామినేషన్ దాఖలు కాలేదు. అభ్యర్థులకి ఈ నెల 23 వరకు సమయం ఉండడం, మరో రెండు రోజులు నామినేషన్లు వేసేందుకు ముహూర్తాలు లేకపోవడంతో, అభ్యర్థులు ఈ రెండు రోజులపాటు నామినేషన్లు వేసేందుకు ముందుకు రాలేదంటు న్నారు. సోమవారం నుంచి నామినేషన్ వేసేందుకు స్వాతంత్ర అభ్యర్థులతో పాటుగా మిగిలిన వారు కూడా నామినేషన్లు వేయడానికి ముందుకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టరేట్లో నామినేషన్ స్వీకరించేందుకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అధికారులు వేచి చూస్తున్నారు. అభ్యర్థులకు ఎటువంటి సందేహాలు ఉన్నా కూడా కలెక్టరేట్ కార్యాలయంలో ఓ చాంబర్ ఏర్పాటు చేశారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంఎల్ఎ చిట్టిబాబు

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి - మామిడికుదురు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం అధికారులు పని చేయాలని పి.గన్నవరం ఎమ్ఎల్ఎ కొండేటి చిట్టిబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి వనజ కుమారి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎమ్ఎల్ఎ విచ్చేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అధికా రులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశుధ్య నిర్వహణకు సొంత డబ్బులు ఖర్చు చేశామని వాటికి సంబంధి ంచిన బకాయిలు చెల్లించాలని సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు అడబాల రామ సత్య నారాయణ, సర్పంచ్‌లు నిరసన వ్యక్తం చేశా రు. గ్రామీణ ప్రాంతాల్లో వేళాపాలా లేకుండా తాగునీరు సరఫరా చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పెదపట్నం లంక సర్పంచ్ కొమ్ముల జంగమయ్య విన్నవించారు. జగనన్న కాలనీలో ఇళ్ళు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఇంతవరకూ సొమ్ములు ఇవ్వలేదని పాశర్లపూడి లంక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు విన్నవించారు. సమావేశంలో కశిరెడ్డి అంజి బాబు, ఎంపిడిఒ కారుపల్లి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ నాగలక్ష్మమ్మ, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సర్వే పనుల వేగవంతానికి ఆదేశం

ప్రజాశక్తి - ఆలమూరు

జగనన్న భూహక్కు సర్వేలో భాగంగా సరిహద్దుల్లో రాళ్ల పనులు వేగవంతం కావాలని జెసి ధ్యాన చంద్ర అధికారులకు ఆదేశించారు. మడికి, బడుగువానిలంక లకు చెందిన భూముల్లో సరిహద్దుల కోసం భూసర్వే రాళ్ల ఏర్పాటును జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సర్వే ఎ.గోపాలకష్ణ, ఆర్‌డిఒ ఎం.ముక్కంటితో కలసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ముందుగా తహశీల్దార్ జెడి.కిషోర్ బాబు, ఎంపిడిఒ కె.జాన్ లింకన్ తదితరులను జరుగుతున్న సర్వేపనులపై ఆరా తీశారు. అలాగే పలువురు రైతులు తమ సమస్యలను, అభ్యం తరాలను జెసికి తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ సర్వే రాళ్లు వేసేటప్పుడు సంబంధిత రైతులు అందుబాటులో ఉండాలన్నారు. ఇప్పటికే తయారైన భూ స్వభావ మ్యాప్ ద్వారా రోవర్ చెకింగ్ చేస్తూ పనులు జరుగుతాయన్నారు. గతంలో ఒకే సర్వే నంబర్లో ఎక్కువ మంది రైతులు ఉండేవా రన్నారు. ఇప్పుడు వారందరికీ విడివిడిగా అంటే ప్రతి రైతుకు ఎల్‌పిఎంలు ఇచ్చారన్నారు. ఇందులో ఎంఎన్ ఆర్ఇజిఎస్, పంచాయతీ రాజ్, రెవెన్యూ, సర్వే వంటి శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పనులు జరుగు తు న్నటు తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ అండ్ జెఇఎఫ్‌ఎసి వి.కామత్ రామచంద్రరావు, కార్యదర్శి మోక్షంజలి తదితరులు పాల్గొన్నారు.



రైతు సమస్యలపై చర్చిస్తున్న జెసి ధ్యానచంద్ర

మంత్రి ఫొటో లేదని ఫ్లెక్సీ తొలగింపు

కోటిపల్లిలో మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి-రామచంద్రపురం

మహాశివరాత్రి సందర్భంగా కోటిపల్లి బస్టాండ్ వద్ద పలువురు యాత్రికులు, రాజకీయ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఇక్కడ గల మత్స్యకారులు రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, యానాం మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, ముమ్మిడివరం ఎమ్ఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్, బోస్ తనయుడు సూర్యప్రకాశ్‌లతో కూడిన ఫ్లెక్సీని సొంతంగా ఏర్పాటు చేశారు. అయితే ఇది గమనించిన మంత్రి అనుచరులు స్థానిక పోలీసుల సహకారంతో మంత్రి వేణు ఫొటో లేని ఫ్లెక్సీని తొలగించారు. దీంతో మత్స్యకారులు కోటిపల్లి మెయిన్ రోడ్డు వద్ద ఆందోళనకు దిగారు. ఇక్కడ చాలా ఫ్లెక్సీలుండగా తాము ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీ ఎందుకు తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు అత్యుత్సాహంతో ఫ్లెక్సీ తొలగించారని ప్రైవేట్‌గా ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలకు ప్రొటోకాల్ ఏమిటని ప్రశ్నించారు. దీంతో గ్రామంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పలువురు మాత్యకారులు మాట్లాడుతూ అన్ని ఫ్లెక్సీలు ఉంచి తమ ఫ్లెక్సీ తొలగించడం అన్యాయ మన్నారు. కార్యక్రమంలో పెమ్మాడి మల్లేశ్వరరావు, కర్రి చిట్టి బాబు, పాలికి శ్రీరాములు. మల్లాడి సత్యనారాయణ మాసకపల్లి వెంకటేశ్వర్లు, సంఘడి శ్రీను, అరదాడి అప్పారావు మత్యకారులు పాల్గొన్నారు.



మంత్రి ఫొటో లేకుండా మత్సకారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



చెక్కు అందజేస్తున్న జనసేన పార్టీ నేత శ్రీనివాస్

బాధితునికి చెక్కు అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు

బడుగువానిలంకకు చెందిన జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్త బండారు వీరన్న ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. అతనికి చికిత్స నిమిత్తం రూ.13,000 విలువైన చెక్కును ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ జారీ చేశారు. ఈ చెక్కును ఆ పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇంఛార్జ్ బండారు శ్రీనివాస్ బాధితునికి అందజేశారు. ఎంపిటిసి పడాల నాగలక్ష్మి, నేతలు పడాల అమ్మిరాజు, సలాది జయప్రకాశ్, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

78 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - మామిడికుదురు

పాశర్లపూడి పంచాయతీలో ఒయన్‌జిసి (రాజమహేంద్రవరం) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 78 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి, మూడవ శుక్రవారం నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒయన్‌జిసి వైద్య నిపుణులు డాక్టర్ ఆకాష్, డాక్టర్ రామ్మోహన్, డాక్టర్ సత్య, వారి సిబ్బంది సుమారు 78 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. పంచాయతీ కార్యదర్శి ఒఇఎస్.రామకృష్ణంరాజు, పంచాయతీ, హెల్త్ సిబ్బంది వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు.



'ఒఎన్‌జిసి' ఆధ్వర్యంలో వైద్యశిబిరం

వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభలకు 'కారెం' హాజరు

ప్రజాశక్తి-అమలాపురం

వ్యవసాయ కార్మిక సంఘం 10వ జాతీయమహాసభలు పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కత్తాలో ఈనెల 15 నుంచి 18 తేదీ వరకు జరుగుతున్నాయి. ఈ సభలకు దేశంలోని 28 రాష్ట్రాల నుంచి 700 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఎపి నుంచి నుంచి 50 మంది హాజరవుగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి కారెం వెంకటేశ్వరరావు ఒక్కరే హాజరయ్యారు. దేశ వ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు ఎదుర్కొటున్న సమస్యల మీద వ్యవసాయ రంగంసంక్షోభం మీద ఈ మహాసభలో చర్చించబోతున్నట్లు వారు తెలిపారు. సమస్యలపై దేశ వ్యాప్త పోరాటాలకువ్యవసాయ కార్మిక సంఘం మహాసభల్లో ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.




పాల్గొన్నసిపిఎంజిల్లాకన్వీనర్ వెంకటేశ్వరరావు

ఘనంగా అమ్మవారి జాతర

ప్రజాశక్తి - ఆలమూరు

పెనికేరులో పుంతలో ముసలమ్మ అమ్మవారి జాతరను శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల నలుమూలల నుంచి యాత్రికులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే ఎస్ఐ ఎస్.శివప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

కార్టూ'నిజం'



సర్కారు ముందు మీ నిద్ర ఏపాటిది...?కుంభకర్ణా..!!!

వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి-ముమ్మిడివరం

పంచాయతీ కార్మికుల వేతన బకాయిలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చెల్లించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. నియోజకవర్గం పరిధి గ్రామపంచాయతీ కార్మికుల ముఖ్య నాయకుల సమావేశం ముమ్మిడివరం సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు మండల అధ్యక్షుడు నిమ్మకాయల వెంకటేష్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి సిఐటియు జిల్లా కార్యదర్శి జి. దుర్గాప్రసాద్ హాజరయ్యి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 2021 సంవత్సరం సంబంధించి 7 నెలల బకాయి వేతనాలు కేంద్ర ప్రభుత్వం ఇవ్వవలసి ఉందని, 2022 సంవత్సరం సంబంధించి 6 నెలల బకాయి వేతనాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. ఈ బకాయిలను ప్రభుత్వాలు ఇప్పటికీ చెల్లించలేదన్నారు. వేతనాలు ఇవ్వక పోతే కార్మికులు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పంచాయతీల పనిచేస్తున్న కార్మికుల జీతాలు చెల్లించాలని, లేకపోతే కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామన్నారు. ఎపి గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ (సిఐటియు) యూనియన్ కార్మిక సమస్యల మీద కోర్టుకు వెళ్లారని కోర్టు అడిగిన ఆధారాలు ప్రతి పంచాయతీలో సేకరణ చేస్తున్నామన్నారు. కార్య క్రమంలో సబ్బతి నాగేశ్వరరావు, జగడం నాగేశ్వరరావు, మోర్త గణపతి, పశ్చిమాల శ్రీరాములు, పండు నాగభూషణం, వడ్డీ సాక్షి, జగడం సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాతున్న సిఐటియు నేతలు

'కోటిపల్లి'లో శివరాత్రికి అరకొర ఏర్పాట్లు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కోటిపల్లి మహా శివరాత్రి కి ఏర్పాట్లు అరకొరగా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు ఇక్కడ రేవులో బారికేడ్లు నిర్మించ లేదు.గతం లో పలువురు యాత్రికులు ఇక్కడ మునిగి చనిపోయిన సంఘటన లు ఉన్నాయి. దీనితో స్నానాల రేవులో పటిష్ట భద్రత చర్యలు తీసుకోవలసి ఉంది. శుక్రవారం సాయంత్రం అగ్నిమాపక సిబ్బంది రేవును శుభ్రపరిచే కార్య క్రమం చేపట్టారు. మిగిలిన పనులు ఎప్పటికీ పూర్తవుతాయి అనేది వేచి చూడాలి. కరోనా దృష్ట్యా గత మూడేళ్ళు అంతంత మాత్రంగానే శివరాత్రి ఉత్సవాలు జరిగాయి. తాగునీటి సరఫరా, యాత్రికులు దుస్తులు మార్చుకు నే స్థలాలు. తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు శనివారం ఉదయానికైనా పూర్తవుతుందో లేదోనని వేచి చూడాల్సి ఉంది.



కోటిపల్లి రేవును శుభ్రపరుస్తున్న దృశ్యం



రాష్ట్ర నాయకులను పూలమాలతో సత్కరించిన తపాలా ఉద్యోగులు

సమ్మె జయప్రదం కోసం పిలుపు

ప్రజాశక్తి-మండపేట

తపాల ఉద్యోగ సమ్మెను విజయవంతం చేయాలని రాష్ట్ర గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వై.మర్రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తపాల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామీణ తపాల ఉద్యోగుల ప్రత్యేక సమావేశానికి వై.కామేశ్వరి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మర్రెడ్డి మాట్లాడుతూ బలవంతపు టార్గెట్లు కోసం గ్రామీణ తపాలా ఉద్యోగులను ఒత్తిడి చేయడం, వేధించడం ఆపేయాలన్నారు. ఈ నెల 20 నుంచి సహాయ నిరాకరణలో భాగంగా ఏ విధమైన అకౌంట్లు ఓపెన్ చేయరాదని మార్చి 2న డివిజనల్ ఆఫీసు వద్ద ధర్నా, మార్చి 16, 17 తేదీల్లో జెసిఎ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా రెండు రోజుల సమ్మెను జయప్రదం చేయాలన్నారు. తిరుపతి డివిజన్ కార్యదర్శి శివరామిరెడ్డి, ఆల్ ఇండియా యూనియన్ మెంబర్ ఆర్.హేమలత, రామచంద్రపురం తపాల ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు వై.స్పర్జిన్‌రాజు, ఎస్‌వి.మునేశ్వరరావు గండ్రోతు రామకృష్ణ, వి.వీరయ్య చౌదరి, జి. రామకృష్ణ చౌదరి, ఎండిఎం షరీఫ్, కె.రామబ్రహ్మం, నీలిమ తదితరులు పాల్గొన్నారు. తొలుత రాష్ట్ర నాయకులను పూలమాలతో సత్కరించారు.

'కుడుపూడి'కి ఎంఎల్‌సి టిక్కెట్‌పై దళితుల ఆగ్రహం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అధికార వైసిపి ప్రభుత్వం కుడుపూడి సూర్యనారాయణ రావుకు ఎమ్ఎల్‌సి టికెట్ ఇస్తే దళితుల ఆగ్రహాన్ని ఆ పార్టీ చవిచూడాల్సి వస్తుందని దళిత జెఎసి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప్పలగుప్తంలో శుక్రవారం దళిత జెఎసి నాయకులు సమావేశం నిర్వహించి అనంతరం సిరిపల్లి–మునిపల్లి ఆర్అండ్‌బి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ అమలాపురం అల్లర్ల సంఘటన నేపథ్యంలో మాలలను కించపరిచే విధంగా మాట్లాడిన సూర్యనారాయణ రావుకు ఎమ్ఎల్‌సి టికెట్ ఇస్తే వైసిపి ప్రభుత్వం మూల్యం చెల్లించుకుంటుందన్నారు. సూర్యనారాయణ రావు కు తప్ప శెట్టిబలిజ కులంలో గాని మాదిగ కులంలో గాని ఎమ్ఎల్‌సి టికెట్ ఎవరికి ఇచ్చినా అభ్యంతరం లేదన్నారు. అనంతరం డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ జె.వెంకటేశ్వరి కి జెఎసి నాయకులు కుంచే బాబులు ఆధ్వర్యంలో కొంకి వెంకట బాబ్జి, తాళ్ల రవి, నడింపల్లి సుబ్బరాజు, పండు చిరంజీవి తదితరులు అందజేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేసి వాహన చోదకులు ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించిన జె ఎ సి నాయకులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి. వెంకటేశ్వర రావు తెలిపారు.



వ్యవసాయ క్షేత్రంలో శ్రీ చైతన్య విద్యార్థులు

పంట పొలాల సందర్శన

ప్రజాశక్తి-మండపేట

వ్యవసాయం ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమంలో భాగంగా స్మార్ట్ లివింగ్ సస్యభారత్" అనే అంశంపై తాపేశ్వరం శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు పంట పొలాలను సందర్శించారు. విద్యార్థులంతా సాంప్రదాయ వస్త్రధారణలో వరిపండించే విధానాన్ని, పశుసంరక్షణకు సంబంధించిన వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, రీజనల్ ఇన్చార్జ్ నరేష్ వైస్ ప్రిన్సిపల్ రాము, డిన్ అరుణ్, సి–ఇన్ ఛార్జ్ లీలా కృష్ణ, ప్రైమరీ ఇన్చార్జ్ ఉమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు 'మడికి' కూరగాయల మార్కెట్‌కు సెలవు

ప్రజాశక్తి - ఆలమూరు

మడికి భక్తాంజనేయ అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెటుకు శివరాత్రిని పురస్కరించుకొని సెలవు ప్రకటించినట్లు కూరగాయల మార్కెట్ కమిటీ శుక్రవారం వెల్లడించారు. ప్రతి ఏటా శివ రాత్రికి అన్నసమారాధన జరుగుతుం దన్నారు. ఈ ఏడాది కూడా మార్కెట్ ప్రాంగణంలో జాతీయ రహదారి పక్కన యాత్రికులంతా వచ్చి స్వామివారి తీర్థప్రసాదా లు స్వీకరించాలన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే రైతులు, వ్యాపారులు శనివారం మార్కెట్ సెలవును గమనిం చాలన్నారు. కార్యక్రమంలో పాలూరి సత్తిబాబు, దొండపాటి వెంకటేశ్వరరావు, పర్వతనేని వెంకట రామారావు, చెల్లుబోయిన సింహాచలం, అందే బుజ్జి, అయినవల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు

ఉమ్మడి జిల్లాల నుంచి 8,779 దరఖాస్తులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుండి ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలకు చెందిన 8779 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బికె.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 80 సీట్లు ఉన్న 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించి ఏప్రియల్ 29వ తేదీన ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో 36 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చిన్న వయసు నుండే పోటీ పరీక్షల్లో పాల్గొనే విధంగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్న మూడు జిల్లాల డిఇఒలకు, ఎంఇఒలకు, హెచ్ఎంలకు, ఉపాధ్యాయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వేయి మందికి అన్నదానం

ప్రజాశక్తి -రౌతులపూడి

మండలంలోని శంగవరం-ఎం.చామవరం గ్రామాల మధ్యలో ఉన్న నందన వనంలోని శివాలయానికి మండలంలోని పలు గ్రామాల నుంచి యాత్రికులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేపట్టారు ఈ సందర్భంగా ఆలయ నిర్వా హకులు నిర్వహించిన అన్నసంతర్పణలో సుమారు వెయ్యి మంది యాత్రికులు అన్నదానం స్వీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.

సామూహిక చర్యలతోనే ఎలుకల నివారణ

ప్రజాశక్తి - కాజులూరు

సామూహిక చర్యలతోనే ఎలుకల నివారణ సాధ్యమవుతుందని మండల వ్యవసాయ అధికారి వి అశోక్ తెలిపారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద బ్రమో డయాలిన్ మందును ఉచితంగా అందజేశారు. 23 రైతు భరోసా కేంద్రా లకు 86 కేజీల బ్రోమోడయాలిన్ మందు సరఫరా చేశామన్నారు. కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులు రామకృష్ణ, నాగేంద్ర, శిరీష, ప్రసాద్, కనకదుర్గ, సురేష్, ఓలేటి ప్రసాద్, ప్రసన్న, ప్రకాష్, దుర్గాప్రసాద్ కౌలు రైతులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

1న జీతాలు చెల్లించండి

- తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, పెండింగ్ సమస్యలు పరిష్క రించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిం చారు. ధర్నా అనంతరం తహశీల్దార్ జితేంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా ఏపీటీఎఫ్ కాకినాడ జిల్లా అధ్యక్షులు ఎన్ పిలిప్ రాజు మాట్లా డుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి ఏపిటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించామన్నారు. ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలని, 12వ పిఆర్‌సి కమిటీ వెయ్యాలని, అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలని, సకాలంలో డిఏలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు విటివి ఆచార్యులు, ఉపాధ్యక్షులు సిహెచ్ విక్టర్‌బాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలు

- ఉత్కంఠగా ఆంధ్రా, బెంగాల్ మ్యాచ్
- మధ్యప్రదేశ్ పై తేలిపోయిన తెలంగాణ
- కేరళ పై విజయం సాధించిన ఒడిస్సా
- గుజరాత్ పై హిమాచల్ విజయం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఆంధ్ర హాకీ జట్టు బెంగాల్ జట్టు నువ్వా నేనా అన్నట్టుగా ప్రేక్షకులకు ఉత్కంఠ కలిగించిన మ్యాచ్ చివరికి డ్రాగా ముగిసింది. లీగ్‌ల మ్యాచ్ కావడంతో పెనాల్టీలు లేకపోవడంతో బెంగాల్ జట్టు ఊపిరి తీసుకుంది. కాకినాడ జిల్లా ప్రాధికార సంస్థ మైదానంలో 13వ ఇండియా సీనియర్ మహిళల జాతీయ ఛాంపియన్షిప్ పోటీలు మూడో రోజు ఆహ్లాదకరంగా జరిగాయి. శుక్రవారం ఒడిశా- కేరళ జట్ల మధ్య జరిగిన మొదటి మ్యాచ్లో ఒడిశా ప్రత్యర్థి కేరళ జట్టుకు ఒక్క అవకాశం కుడా ఇవ్వకుండా 13 గోల్స్ సాధించి విజయం సాధించిది. ఈ మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రింకు కుజు అందుకుంది.

తేలిపోయిన తెలంగాణ

ఆంధ్రా జట్టుతో పాటు తెలంగాణ జట్టు ఆటపై ప్రేక్షకులు మంచి



తలపడుతున్న ఒడిశా- కేరళ జట్లు

ఆసక్తిని కనపరిచారు. దీనికి తగ్గట్టుగా కూడా మైదానంలో తెలంగాణ జట్టు అట తీరును ప్రదర్శించ లేకపోయింది . మధ్యప్రదేశ్ చేతిలో ఒక్క గోల్‌ను కూడా సాధించకుండా 30గోల్స్ సమర్పించుకుని ఓటమిని పాలైంది.. ప్లేయర్ అఫ్ ధి మ్యాచ్ ప్రీతి దుర్గ్ కైవసం చేసుకుంది.

ప్రత్యర్థికి అవకాశం ఇవ్వని హిమాచల్ జట్టు

హిమాచల్- గుజరాత్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో 10-1 స్కోర్ నమోదు చేయగా, 9 గోల్స్ తెడాతో హిమాచల్ విజయం సాధించింది. ప్లేయర్ అఫ్ థి మ్యాచ్ అవార్డును రీతు కైసవం చేసుకుంది.

ఆంధ్రా - బెంగాల్ నువ్వా.. నేనా..

ఆంధ్ర- బెంగాల్ జట్ల మధ్య మ్యాచ్ ఉత్కంఠ కలిగించింది. గోల్ వేసేందుకు రెండు జట్టు తలపడ్డాయి. చివరి వరకు పోరాడినా మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. మ్యాచ్‌లో ప్రతిభ కనబ రిచిన ఆంధ్ర టీమ్‌కు చెందిన కెవివి.దుర్గ ప్లేయర్ ఆఫ్ ది అవార్డు దక్కించుకుంది.

18వ తేదీ నాటి మ్యాచ్ వివరాలు

ఉదయం 7:00: కర్ణాటక- గోవా
ఉదయం 8:45 : జర్ఖండ్- ఉత్తరాఖండ్
ఉదయం 10:30: హర్యానా - బీహార్
మధ్యాహ్నం 12:15: ఢిల్లీ - మణిపూర్
సాయంత్రం 3:45: మహారాష్ట్ర - అండమాన్-నికోబార్

ప్లాస్టిక్‌తో పొంచి ఉన్న ముప్పు

-పర్యావరణ సంరక్షణపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - పిఠాపురం

ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు పొంచి ఉందని టిఈఎస్-ఎ ఎంఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రోగ్రాం ఆర్గనైజర్ సుందర రామ్మూర్తి తెలిపారు. పర్యావరణ కాలుష్యం వాటివల్ల కలిగే అనర్థాలపై స్థానిక అగ్రహారంలో ఉన్న హార్వెస్ట్ స్కూల్లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో టిఈఎస్-ఎ ఎంఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రోగ్రాం ఆర్గనైజర్ సుందర రామ్మూర్తి ప్రస్తుత రోజుల్లో పర్యావరణ కాలుష్యం గ్లోబల్ వార్మింగ్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ప్లాస్టిక్ వాడకంతో పొంచి ఉన్న ముప్పును విద్యార్థులకు తెలిపారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, నష్టాలపై విద్యార్థులు అవగాహన ఏర్పరచుకుని తల్లిదండ్రులకు, సమాజానికి అవగా హన కల్పించి పర్యావరణ పరిరక్షణ బాధ్యత తీసు కోవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సత్యమోహన్ రెడ్డి, సంత్యానందరెడ్డి, ప్రిన్సిపాల్ అనిల్ రవీంద్ర, మోజెస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ'పరేషాన్'...

- ఎవరి నిర్లక్ష్యం.... తేల్చేదెవరు?
- ఆపరేషన్ జరిగిందని వైద్యులు అన్నారంటూ బాధితుడి ఆరోపణ
- పేషెంట్ నుంచి వార్డు బోయ్‌లు రూ.3 వేల డిమాండ్
- తీరా చూస్తే ఆపరేషన్ జరగక బాధితుల పాట్లు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

గర్భసంచి సమస్యతో కాకినాడ జిజిహెచ్‌లో చేరిన ఓ బాధితురాలికి ఆపరేషన్ థియేటర్‌కు తీసుకువెళ్లి ఆపరేషన్ చేశారని, వార్డుకు తరలించేందుకు రూ.3వేలు ఇస్తే వార్డుకు తరలిస్తాం.. లేదంటే ఇలానే వదిలేస్తామని వార్డు బోయ్‌లు అన్నారంటూ పేషెంట్ భర్తకు జిజిహెచ్‌లో ఎదురైన పరా భావాలు, పేషెంట్‌కు మాన సిక ఆందోళన గురి చేసిన సంఘటన కాకినాడ జిజిహెచ్‌లో వెలుగు చూసింది. బాధితుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

సామర్లకోట మండలం తొండంగి గ్రామానికి చెందిన గేదెల రాంబాబు భార్య తులసమ్మ గత మంగళవారం గర్భసంచి సమస్యతో ప్రభుత్వ ఆసుపత్రిలో జాయిన్ అయింది. మరుసటి రోజు నుంచి స్కానింగ్ పరీక్షలు బయట రిఫర్ చేసి, ఆపరేషన్‌కు రక్తం అవసరం అవుతుందని బుధవారంలోగా అన్నీ సిద్ధం చేసుకు రావాలని డాక్టర్లు సూచించారు. ఆ విధంగానే అన్ని ఏర్పాట్లు చేసు కుని పేషెంట్, ఆమె భర్త వచ్చారు. ఇంత వరకు వ్యవహారం సజావుగానే సాగింది.

బుధవారం ఆపరేషన్ థియేటర్‌కు తీసుకువెళ్లి రెండు, మూడు గంటలు అయిన తరువాత పేషెంట్ తులసమ్మను బైటకు పంపడంతో, మత్తులో ఉన్న తన



కాకినాడ జిజిహెచ్‌లో గైనిక్ వార్డులో పేషెంట్ తులసమ్మ, భర్త రాంబాబు

భార్యను చూసి ఆపరేషన్ అయిందని అనుకున్నామని రాంబాబు తెలిపాడు. అప్పుడే వార్డు బాయ్‌లు వచ్చి పేషెంట్‌ను ఆపరేషన్ థియేటర్ నుంచి వార్డుకు తరలించాలంటే రూ.మూడు వేలు అవుతుందని డిమాండ్ చేసి మరీ డబ్బులు తీసుకున్నారని తెలిపాడు. అయితే ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆపరేషన్ పూర్తవడంతో డబ్బులకు వెనుకాడకుండా వారు అడిగింది ఇచ్చా మని బాధితుడు తెలిపాడు. అయితే తన కూతురు తల్లికి ఎక్కడ ఆపరేషన్ జరిగిందో చూస్తే కడుపుపై ఒక కుట్టు కూడా లేకపోవడంతో అసలు ఆపరేషన్ జరగలేదని తెలుసుకుని ఆశ్చర్యపోయామన్నాడు. అసలు ఏం జరిగిందని అక్కడ వైద్యుల్ని అడిగితే కాలేదని, వార్డు బోయ్‌లు అయిందని సమాధానం చెబుతున్నారని తెలిపాడు. ఇప్పుడు తప్పు వైద్యులదా? లేక చెప్పిన వార్డు బోయ్‌లదా అన్నది పక్కన పెడితే .. ఆపరేషన్ అయిందో లేదోనని అయోమయంలో ఇప్పుడు తన భార్య మానసికంగా ఇబ్బంది పడుతోందని రాంబాబు తెలిపాడు. రేపు అన్న రోజున ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని బాధితుడు ప్రశ్నిస్తున్నాడు. కాగా వార్డు బోయ్‌లు రేపు ఉదయం మీ డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని చెబుతున్నారని, తమకు ఏమీ సంబంధం లేదన్నట్టు వ్యవహరిస్తున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తమకు న్యాయం జరిగిలా చూడాలని కోరుతూ జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతకు ఫిర్యాదు చేశానని రాంబాబు తెలిపాడు.

సమస్య నా దృష్టికి వచ్చింది

- త్వరలో ఆపరేషన్ చేస్తాం

బాధితురాలి సమస్య నా దృష్టికి వచ్చింది. ఆమెకు మత్తుమందు ఇచ్చి బయాప్సీ మాత్రమే చేశారని వైద్యులు తెలిపారు. మిగిలిన వ్యవహారమంతా నాకు తెలియదు. లిఖితపూర్వకంగా ఎవరైనా ఫిర్యాదు చేస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటా. మరో కొద్ది రోజుల్లో ఆమెకు ఆపరేషన్ చేయడం జరుగుతుందని సూపరిండెంట్ డాక్టర్ హేమలత తెలిపారు.

శైవ క్షేత్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాశక్తి - కాజులూరు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని సైవ క్షేత్రాలు వద్ద భక్తుల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్రాక్షారామ భీమేశ్వర స్వామికి, అష్ట సోమేశ్వరాలయాల్లో పెనుమళ్ళ కోలంక శైవక్షేత్రాలతో పాటు కాజులూరు శైవ క్షేత్రం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాజులూరు శివాలయానికి సుమారు 50 వేలమంది యాత్రికులు దర్శించుకుంటారని అంచనాతో ఎస్ఐ తులసీరామ్ ప్రత్యేక బందోబస్తుతో బారికేడ్లు ఏర్పాటు చేశారు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుతోపాటు ప్రత్యేక భోజన వసతులకు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి.

రూ.2.5 కోట్లతో క్రాస్‌బండ్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

రబీలో సాగునీటి ఎద్దడి లేకుండా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రూ.2.5 కోట్లతో మురుగు కాలువల్లో క్రాస్ బండ్‌లు ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. కూనవరం ప్రధాన మురుగు కాలువలో గొరగనమూడి మురుగు కాలువ కలిసే చోట మురుగు కాలువలో వేసిన క్రాస్ బండ్ ను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. రబీ సీజన్ లో రైతులు అక్కడక్కడ ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ తెలిపారు. అలాగే నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో రైతులు కాలువల్లో ఉన్న నీటిని పంట పొలాల్లోకి ఇంజన్ ల సాయంతో తోడుకునేందుకు రూ.4 నుంచి 5 కోట్లు నిధులు మంజూరైనట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గోపవరం సర్పంచ్ కుంచే బుల్లియ్య, డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యులు జిన్నూరి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ యాళ్ళ లక్ష్మీనారాయణ, సొసైటీల అధ్యక్షులు ఊటాల రామాంజనేయులు,మారిశెట్టి పుండరీకాక్షుడు, అడపా రమేష్ తదితరులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం వాడపర్రు పంట కాలువను శివారు ప్రాంతమైన కూనవరంలో కలెక్టర్ పరిశీలించారు. శివారు ప్రాంతమైన కూనవరంలో రైతులు సాగునీటిని ఎద్దడిని ఎదుర్కొంటున్నట్టు కలెక్టర్ కు రైతులు తెలిపారు. కలెక్టర్ వెంట



కూనవరంలో క్రాస్‌బండ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

ఇరిగేషన్ ఎస్ఇ జి.శ్రీనివాస్, ఇఇ డివి.రాంగోపాల్, డిఇ శ్రీనివాస్, డ్రెయిన్స్ ఇఇ సుబ్బయ్య, డిఇ, ఎంవివి.ప్రసాద్, వ్యవసాయ శాఖ ఎడి ఎంఎ షంషీ, తహశీల్దార్ జె. వెంకటేశ్వరి, తదితరులు ఉన్నారు.

అత్యాచారానికి పాల్పడిన వారిపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-అమలాపురం/కాట్రేనికోన

జిల్లాలోని కాట్రేనికోన మండలం చిర్రాయానాం గ్రామంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కన్వీనర్ కారం వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా నాయకులు జి.దుర్గాప్రసాద్, కెవిపిఎస్ జిల్లా నాయకులు పి.వసంత కుమార్‌లు మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి అన్నారు. చిర్రయనం గ్రామంలో జరిగిన దారుణానికి ప్రభుత్వ వైఫల్యం కారణం అన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాలు ఆదుకోవాలని, కుటుంబానికి ఎక్స్ గ్రేషియా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు గ్రామీణ ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు పూర్తిగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

మండల మహిళా సమాఖ్య సమావేశం

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రంలో వైఎస్ఆర్ క్రాంతి పథం (డిఆర్‌డిఎ) కార్యాలయంలో మండల ఇంచార్జ్ ఎపిఎం మందపల్లి ధనరాజు ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య ట్రెజరర్ మంగతాయారు అధ్యక్షతన మండల మహిళా సమాఖ్య సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో మండల విద్యాశాఖాధికారి డి.మురళీ సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని సమావేశ ముఖ్య అంశాలపై చర్చించారు. ప్రాజెక్ట్ ప్రాధాన్యతా అంశాలైన జగనన్న తోడు, చేయూత, ఎహెచ్ హౌసింగ్, స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంక్ లింకేజీ రుణాలు మొదలగు అంశాలలో లక్ష్యాలపై చర్చించారు. సిఐఎఫ్, విఆర్ఎఫ్ ఉన్నతి రుణాలు తీసుకుని సక్రమంగా చెల్లింపు చేయకుండా మొండి బకాయిలు ఉన్న గ్రామ సమాఖ్యలకు మండల సమాఖ్య నుంచి నోటీసులు కూడా జారీ చేస్తారన్నారు. స్కూల్ డ్రాపౌట్ చిల్డ్రన్, బాల కార్మికులు, బాల్య వివాహాలు హరికట్టడంలో స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాల పాత్ర వంటి అంశాలపై చర్చించారు. సమావేశానికి గ్రామ సమాఖ్య ప్రతినిధులు, సిసిలు తదితరులు హాజరయ్యారు.

162 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అంగర పిహెచ్‌సిపరిధిలోని కపిలేశ్వరపురం సత్యనారాయణపురంలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరంలో 162 మందికి వైద్య పరీక్షలు నిర్వహిం చారు. అంగర పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ జె.అనుజ ప్రియాంక మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి నెలా ఎఫ్‌పిసి బందం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గర్భిణులను, పిల్లలను, బిపి, షుగర్ పేషంట్లను, వద్దులను పరీక్షించి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు తెలిపారు.



కపిలేశ్వరపురం లో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ప్రియాంక

ఆమె ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పలు వ్యాధులకు సంబంధించి 162 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బి. రామారావు, సూపర్‌వైజర్లు పి.సురేష్, టి.మేరీ మణి, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడి ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ద్వారపూడిలో జరిగిన కార్యక్రమంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

25, 26 తేదీల్లో ఇఫ్టూ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి-మండపేట

శ్రీకాకుళంలో ఫిబ్రవరి 25,26 తేదీలలో జరుగు ఇఫ్టూ 9వ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ మండలంలోని ద్వారపూడిలో శుక్రవారం జరిగింది. పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో 33శాతం, ఆహార సబ్సిడీలో 30.6శాతం కోత, ఎరువుల సబ్సిడీలో 21.6శాతం కోత, గ్రామీణాభివద్ధిలో 12.31శాతం కోత పెట్టిందన్నారు కార్పొరేట్లకు రాయితీలు, పేదలకు కోతల బడ్జెట్ తప్ప వేరుకాదని అన్నారు. కార్పొరేట్ ప్రయోజనాలు మినహా కేంద్ర ప్రభుత్వానికి మరేవి పట్టడంలేదని అన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను, సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతోందని అన్నారు. వాటిలో పర్మినెంట్ ఉద్యోగుల స్థానాలను తక్కువ వేతనాలతో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, క్యాజువల్ వర్గాలతో నింపివేస్తున్నారన్నారు. మహిళా, శిశు సంక్షేమ రంగాలలో కనీస హక్కులు, కనీస వేతనాలు లేకుండా గౌరవ వేతనం పేరుతో స్కీమ్ వర్కర్లతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు గెద్దాడ సూరిబాబు క్లాత్ పార్సెల్ జట్టు కార్యదర్శి పోతురాజు, సత్యనారాయణ, రాంబాబు రామకష్ణ సతీష్ నూకరాజు రామారావు తదితరులు పాల్గొన్నారు.